గుంటూరు వార్త



# జేఈఈ అడ్వాన్స్ 2026 ఫలితాలలో జాతీయ స్థాయి ఓపెన్ కేటగిరి ర్యాంకులతో అగ్రస్థానంలో భాష్యం

*- ఆలిండియా 100 లోపు 9 ర్యాంకులతో భాష్యం..*

గుంటూరు విద్య జూన్ 1 ప్రభాతవార్త: జేఈఈ అడ్వాన్స్ 2026 ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థులు ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించారని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. సోమవారం విడుదలైన ఫలితాలలో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ విద్యార్థి వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఓపెన్ కేటగిరిలో ఆలిండియా





34వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారన్నారు. ప్రవీణ్ కుమార్ రెడ్డి 6వ తరగతి నుండి భాష్యం ఐఐటి ఫౌండేషన్ తో ఈ ఘన విజయాన్ని కైవసం చేసుకున్నట్లు రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా వివిధ కేటగిరిలలో జె. చాము వర్షిత్ ఆలిండియా 3వ ర్యాంకు, సిహెచ్. సాహిల్ ఆలిండియా 6వ ర్యాంకు, డి.పవన్ ఆలిండియా 16వ ర్యాంకు, కె.రామకృష్ణారెడ్డి ఆలిండియా 23వ ర్యాంకు, వి.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆలిండియా 34వ ర్యాంకు, హఫీజ్ నూర్ బాషా ఆలిండియా 42వ ర్యాంకు, వై.ప్రవచన ఆలిండియా 54వ ర్యాంకు, ఆర్.బాలానాయక్ ఆలిండియా 76వ ర్యాంకు, సిహెచ్.వెంకట నాగపవన్ ఆలిండియా 82వ ర్యాంకు వంటి 100లోపు 9 ఆలిండియా ర్యాంకులు, 200లోపు 21 ర్యాంకులు, 500లోపు 53 ర్యాంకులు, 1000లోపు 93 ర్యాంకులు, 2000లోపు 126 ర్యాంకులు మరియు 5000లోపు 235 ఆలిండియా ర్యాంకులు సాధించడంతో పాటు ఐఐటి సెలెక్షన్స్ లో ఆలిండియా అల్ టైం ది బెస్ట్ గా నిలిచిందన్నారు. అన్ని పోటీ పరీక్షా ఫలితాలలో ఆల్ రౌండర్స్ గా నిలుస్తున్న భాష్యం ఐఐటి అకాడమీ విద్యార్థులను చూస్తే గర్వంగా ఉందని, ఈ అద్భుత ఫలితాలకు పక్కా ప్రణాళికతో కూడిన మా భాష్యం ఐఐటి ఫౌండేషన్ కరిక్యులమే ముఖ్య కారణమన్నారు. ఇటీవల చైర్మన్ భాష్యం రామకృష్ణ జెఈఈ మెయిన్లో ఓపెన్ కేటగిరిలో 100 పర్సంటైల్ తో పాటు ఆలిండియా 11వ ర్యాంకు సాధించిన టి.దుర్గా సుప్రభాత్ కు రూ.10 లక్షల చొప్పున ఉన్నత చదువు నిమిత్తం నగదు ప్రోత్సాహక చెక్కును అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్, భాష్యం ఐఐటి ప్రోగ్రామర్ ఆనందకుమార్ లు అభినందించారు.

# బాపట్లలో నేటి నుంచే నో హెల్మెట్ నో పెట్రోల్ అమలు

**- శ్రీకారం చుట్టిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్**

బాపట్ల, జూన్ 1: ప్రభాత వార్తా ప్రతినిధి:ద్విచక్ర వాహనదారులు ఇకపై హెల్మెట్ లేకుండా పెట్రోల్ బంకులకు వెళ్తే ఇంధనం దొరకడం కష్టమే. రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా బాపట్ల జిల్లా పోలీస్ శాఖ సరికొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రయోగాత్మకంగా "నో హెల్మెట్ నో ఫ్యుయల్" విధానాన్ని జూన్ 1వ తేదీ సోమవారం నుండి




అమల్లోకి తెచ్చినట్లు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. తొలి విడతగా బాపట్ల టౌన్, రూరల్, వెదుళ్ళపల్లి, కర్లపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. ఎస్పీ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్.హెచ్.ఓ లు, సిబ్బంది పెట్రోల్ బంకుల వద్ద మోహరించారు. బంకులకు వచ్చే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తూ,హెల్మెట్ లేని వారికి పెట్రోల్ పోయవద్దని బంక్ నిర్వాహకులకు స్పష్టం చేశారు.

# ఉద్యోగులకు సన్మానం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్1, ప్రభాతవార్త: ఏఎన్‌యులో సిఇగా పనిచేస్తున్న ఆలపాటి శివప్రసాదరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ షేక్ బషీర్ అహ్మద్, సూపరింటెండెంట్ టంకశాల వెంకటేశ్వరావులు ఉద్యోగ విరమణ చేశారు. వారికి వికాస ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం



నిర్వహించారు. వీసి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వికాస అధ్యక్షుడు నీలపు ప్రసాద్, కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, ఏసిఇ వెంకటేశ్వరరావు, కావూరి శ్రీనివాసరావు, రెడ్డి ప్రకాష్, వికాస నాయకులు విజయ్ ప్రకాష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, పి.నాగరాజు, నూతక్కి వెంకటేశ్వర్లు, శశిధర్, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, వైస్‌ప్రెసిడెంట్ బి.రత్తయ్య, ఉద్యోగులు పాల్గొని ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం చేశారు.

# ఎన్‌సీసీ నేషనల్ స్పెషల్ ఇంటిగ్రేటెడ్ క్యాంపులో

**ఆర్.వి.ఆర్ జెసి. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని తనూజకు ప్రథమ బహుమతి**

గుంటూరు విద్య జూన్ 1 ప్రభాతవార్త : సాంకేతిక విద్యతో పాటు సామాజిక బాధ్యత, దేశభక్తిలోనూ తమ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయిలో అవార్డులు సాధించుకోవడం గర్వకారణమని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో 12 రోజుల పాటు నిర్వహించిన ఎన్‌సీసీ నేషనల్ స్పెషల్ ఇంటిగ్రేటెడ్ క్యాంప్ లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు



పాల్గొన్నారు. ఈ శిబిరంలో ట్రెక్కింగ్, విపత్తు నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్య అవగాహన, దేశంలోని వివిధ రాష్ట్రాల వనరులు, ఆర్థిక విధానాలు, దేశభక్తి, సామాజిక సేవ తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణా మరియు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. శిబిరంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషీన్ లెర్నింగ్ విభాగం నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని డి. తనూజ సాంస్కృతిక విభాగంలో అసాధారణ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొని జాతీయ స్థాయి అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా అవార్డు సాధించిన విద్యార్థినిని సోమవారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు సామాజిక సేవా దృక్పథాన్ని కూడా పెంపొందించుకోవాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, కళాశాల ఎన్.సి.సి బాలికల విభాగ అధికారి లెఫ్టినెంట్ ఉషాక్రాంతి తదితరులు తనూజకు అభినందించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు: చీఫ్‌విప్ జీ.వీ.,డీసీసీబీ మక్కెన

వినుకొండ, జూన్1,ప్రభాతవార్త: పట్టణంలోని మాస్టిన్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీసీసీబీ మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొని లబ్ధిదారులకు నేరుగా పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి



పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సకాలంలో అందిస్తూ అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. వృద్ధులు,వికలాంగులు,వితంతువుల ముఖాల్లో ఆనందం చూడటమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం,జనసేన,బీజేపీ కూటమి పార్టీల ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సి.యం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

గుంటూరు, జూన్ 1 ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 3వ తేదీన పి.వి.ఎస్ లలిత ఆసుపత్రి ప్రారంభోత్స వానికి విచ్చేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్‌వర్మ సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# అర్హత ఉన్న పేదలకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవటమే కూటమి లక్ష్యం

**- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

కొల్లిపర,జూన్ 1 ప్రభాతవార్త: అర్హత కలిగిన పేదవారికి పెన్షన్ ఇచ్చి ఆదుకోవటమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర శ్రీవీరభద్రస్వామికాలనీ బీసీ.ఎస్సీ.ఎస్టీ.ఓసి కాలనీల్లో ఆయన అధికారులతో కలసి ఇంటింటికీ తిరిగి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేసారు.ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.సక్రమంగా పెన్షన్ అందుతుందా.. అని పెన్షన్‌దారులను అడిగారు..డీలర్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారా.. అని ఆరా తీసారు. ఈ సమయంలో పలుకాలనీవాసులు పారిశుద్ధ్యం అధ్వాన్యంగా ఉందని.. మురుగునీరు స్థంబించి ఉండలేకపోతున్నామని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇంకొందరు గ్రామస్తులు మొక్కజొన్న.. జొన్న కొనుగోలు చేయక పోవటంతో నష్టపోయామని..ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ఆలస్యంగా ప్రారంభించటంతో ధాన్యం అమ్ముకోలేకపోయామని కొందరు రైతులు చెప్పారు.ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ఏర్పాటు చేస్తామని చెప్పారు.మండలంలో పెన్షన్‌లు 9 వేల 375 మందికి రూ.3 కోట్ల 96 లక్షల రూపాయలు నగదు రూపంలో ప్రతినెల 1వ తేదీన అందిస్తున్నామని చెప్పారు. భారతదేశంలో ఎక్కడాలేని విధంగా కూటమి ప్రభుత్వం రూ.4 వేలు పెన్షన్ ఇచ్చి పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చిందన్నారు. ప్రజలు సంక్షేమంతో పాటు అభివృద్ధిని కోరుకుంటున్నారని అధి తప్పక నెరవేర్చుతామని స్పష్టం చేసారు.గ్రామంలో స్థంబించిన చోట మురుగునీరు అంతా వారం రోజుల్లో తొలగించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించటం జరిగిందన్నారు.కూటమి






ప్రభుత్వం ఏర్పడ్డాక మండలంలో 80 శాతం రోడ్లు పూర్తి చేసామని చెప్పారు.ఉపాధిహామీ పథకం ద్వారా రెండు నెలల్లోనే ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇచ్చిన నిధులతో రూ.28 కోట్లతో అత్యవసరమైన చోట డ్రైనేజీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

వరి..పత్తి సంప్రదాయల పంటల కంటే ఆయిల్‌ఫామ్ సాగు లాభదాయకం

కేంద్ర వ్యవసాయశాఖ అధ్యయనాల ప్రకారం వరి..పత్తి సంప్రదాయల పంటల కంటే ఆయిల్‌ఫామ్ సాగు రైతులకు లాభదాయకమని మంత్రి నాడదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు.సోమవారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయిల్‌ఫామ్‌పై రైతులతో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు.డీహెచ్‌ఓ రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో మనోహర్ ప్రసంగిస్తూ భారతాదేశం వంటనూనెల అవసరాల కోసం ఏటా వేలకోట్ల రూపాయలు విదేశాలకు చెలిస్తుందన్నారు. భారతదేశంలోనే ఆయిల్‌ఫామ్ సాగు ఆంధ్రప్రదేశ్‌లోనే ముందంజలో ఉందన్నారు. దిగుమతులు తగ్గించే దిశగా జాతీయ స్థాయిలో ఆయిల్‌ఫామ్ సాగు విరించాలని కేంద్ర..రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకుందన్నారు.విదేశాల నుండి వంట ఁనూనెలు దిగుమతి చేసుకోవటం వలన యుద్ధం కారణంగా ఒక్కసారిగా పామ్ ఆయిల్ రూ.120 నుంచి రూ.160 కు చేరిందన్నారు. రాను..రాను రైతుల పాలిట కల్పవృక్ష ంగా అయ్యే అవకాశం ఉందని రైతులు ముందుకు వచ్చి ఆయిల్‌ఫామ్ సాగు చేపట్టి ఆర్థిక పరిస్థితి మెరుగుపర్చుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి,తహశీల్దార్ గుమ్మడి సిద్ధార్థ,ఎంపీడీవో విజయలక్ష్మీ,డిప్యూటి ఎంపీడీఓలు భార్గవ్,దానయ్య, పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,ఆయిల్‌ఫామ్ శాస్త్రవేత్త రామచంద్ర,జేడీఏ విజయవాణి,ఏడిఏ విజయబాబు,మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, ఉద్యానవన శాఖాధికారి శ్రీనిత్య తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

గుంటూరు జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి :ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2026 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రూపొందించిన వన్ ఇండస్ట్రీ వన్ గ్రీన్ ఇనిషియేటివ్ పర్యావరణ అవగాహన పోస్టర్ ను గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ సోమవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, గుంటూరు పర్యావరణ ఇంజినీర్ ఎం.డి నజీన బేగం




, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది, పర్యావరణ కోఆర్డినేటర్ డి. తిరుపతి రెడ్డి , ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ పరిశ్రమలు పర్యావరణ పరిరక్షణను తమ సామాజిక బాధ్యతగా భావించి నియమాలను అనుసరించడమే కాకుండా, ఆచరణాత్మకమైన , వినూత్నమైన హరిత ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా పర్యావరణ ఇంజినీర్ ఎం. డి నజీన బేగం మాట్లాడుత, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకువన్ ఇండస్ట్రీ వన్ గ్రీన్ ఇనిషియేటి కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమాన ప్రాధాన్యతతో కొనసాగాలని, నీటి సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వినియోగం, చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పరిశ్రమలలో పర్యావరణ, వనరుల వినియోగం, వ్యర్థాల నిర్వహణ, స్థిరమైన అభివృద్ధి, పర్యావరణ నియంత్రణ అంశాలపై మెరుగైన అవగాహన, స్వచ్ఛమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.చెట్టు మనకోసం - మన భూమి కోసమే అనే సందేశాల తో ప్రతి పరిశ్రమ, ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# గుంటూరు కార్పొరేషన్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

*- అంతర్జాతీయ పురస్కారం జెండర్ ఈక్వాలిటీ మొబిలైజేషన్ అవార్డు*

*- అవార్డు అందుకున్న కమిషనర్ కే. మయూర్ అశోక్*

గుంటూరు కార్పొరేషన్, జూన్ 1 ( ప్రభాత వార్త ) : గుంటూరు కార్పొరేషన్ కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కించుకుంది. గుంటూరు నగరపాలక సంస్థకు అంతర్జాతీయ




పురస్కారం: గీవిదీవీ ׳జెండర్ ఈక్వాలిటీ మొబిలైజేషన్ అవార్డు ను కమిషనర్ మయూర్ అశోక్ అందుకున్నారు. ఐక్యరాజ్యసమితికి చెందిన యునిడో (యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) ప్రతిష్ఠాత్మక "జెండర్ ఈక్వాలిటీ మొబిలైజేషన్" అవార్డును గుంటూరు నగరానికి ప్రకటించింది. సోమవారం విజయవాడలోని లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్‌లో జరిగిన ఖిసస్టైనబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ పైలట్ (ఖీదిఃశిశి)ఖి ప్రాజెక్ట్ వర్క్‌షాప్‌లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ ఈ అంతర్జాతీయ అవార్డును జిఎంసి మహిళా కార్మికులతో కలిసి కేంద్ర స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ సురభి మాలిక్ చేతుల మీదుగా అందుకున్నారు. మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణను అనుసంధానిస్తూ గుంటూరు నగరపాలక సంస్థ అమలు చేసిన వినూత్న విధానాలకుగాను ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. మహిళా సాధికారతలో భాగంగా పారిశుధ్య నిర్వహణలో మహిళలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయడంతో పాటు, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మహిళా కార్మికులే డ్రైవర్లుగా ఎలక్ట్రికల్ ఆటోల ద్వారా చెత్త సేకరించే విధానాన్ని ప్రవేశపెట్టారు. సామాజిక ఉన్నతి, జీరో ఉద్గారాల సేకరణతో కూడిన ఈ విశిష్టమైన కలయికతో జిఎంసి చేపట్టిన పద్ధతులు అంతర్జాతీయ ప్రతినిధులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఖిగ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీఖి 2016లో భారతదేశంలో ఈ ఖిసస్టైనబుల్ సిటీస్ ఇంటిగ్రేటెడ్ అప్రోచ్ పైలట్ఖి ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా కేవలం ఐదు నగరాలను మాత్రమే ఈ ప్రాజెక్ట్ కోసం ఎంపిక చేయగా, అందులో భోపాల్, జైపూర్, మైసూర్ నగరాలతో పాటు ఆంధ్రప్రదేశ్ నుండి గుంటూరు, విజయవాడ నగరాలకు మాత్రమే చోటు దక్కించుకున్నాయి. అంతర్జాతీయ అవార్డు రావడం పట్ల గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గుంటూరును మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# అంబేద్కర్ చైర్‌లో జయదేవ్‌కు పీహెచ్‌డి ప్రదానం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్1, ప్రభాతవార్త: ఏఎన్‌యులోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ విభాగంలో కాంట్రిబ్యూషన్స్ ఆఫ్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇన్ మేకింగ్ మోడ్రన్ ఇండియా అనే అంశంపై పరిశోధన చేసినందుకు వడ్డే జయదేవ్‌కు వర్సిటీ పీహెచ్‌డి ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. జయదేవ్‌కు పరిశోధన పర్యవేక్షకులుగా ప్రొఫెసర్ ఎస్. మురళీమోహన్ వ్యవహరించారు. ఈసందర్భంగా జయదేవ్‌ను విభాగాధిపతి ఆచార్య వై.అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహాం లింకన్, పరిశోధకులు అభినందనలు తెలిపారు.



# పండుగలా ఎన్టీఆర్ భరోస్తా పెన్షన్ల పంపిణీ

*కలెక్టర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి అందజేత*

*దేశంలోనే అత్యధికంగా రూ.4 వేలు ఇస్తున్న సీఎం చంద్రబాబు*

*తొలిరోజే 98 శాతం పంపిణీ పూర్తి: బాపట్ల ఎమ్మెల్యే*

బాపట్ల.జూన్ 1: ప్రభాత వార్తా ప్రతినిధి:రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగుతోందని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధికారులు, స్థానిక నాయకులతో కలిసి తాము ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు నేరుగా పెన్షన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. సోమవారం బాపట్ల



పట్టణంలోని 33వ వార్డు చంగల్‌రాయుడు తోటలో నిర్వహించిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పెన్షన్ నగదును అందజేశారు.

**విమర్శలు పటాపంచలు.. దేశంలోనే మనమే టాప్!**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా రూ.4,000 పెన్షన్‌ను కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే అందిస్తోందని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల్లో రూ.600 నుంచి రూ.2,000 లోపే ఇస్తున్నారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం పెన్షన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయలేదంటూ గతంలో ప్రతిపక్షాలు చేసిన విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. విమర్శలకు భిన్నంగా.. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయం 10 గంటలకల్లా 98 శాతానికి పైగా పెన్షన్ల పంపిణీ పూర్తవుతోందని గణాంకాలతో సహా వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీని పర్యవేక్షి ంచిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌కు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, వార్డు అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళిత భూముల్ని కబ్జా చేసిన దుర్మార్గుడు బొల్లా బ్రహ్మనాయుడు

*- బాధిత జోసెఫ్ ఫెడ్రిక్ కుటుంబ సభ్యుల ఆవేదన*

*- భూమి ఆక్రమణలో న్యాయవాది ఎం.ఎన్ ప్రసాద్‌కు వాటా*

వినుకొండ,జూన్1,ప్రభాతవార్త: వైసిపి పాలనలో అధికారం అడ్డం పెట్టుకొని దళిత భూములు దౌర్జన్యంగా కబ్జా చేసిన దుర్మార్గుడు బొల్లా బ్రహ్మనాయుడు అని బాధితులు బొప్పూడి జోసఫ్ ఫెడ్రిక్ అతని భార్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నరసరావుపేట రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తన మేరాయమ్మ 1962లో బ్రాహ్మణపల్లి 60 అడుగుల రోడ్డులో సర్వేనెంబర్ 30913బి,2.00 ఎకరాల భూమిని నాడు కొనుగోలు చేశారని, 2008 వరకు మేము సాగులో ఉన్నామని,తమకు పక్కనే 4 ఎకరాల్లో ఉన్న బర్నబాస్ అనే వ్యక్తి మా రెండెకరాల భూమిని ఆక్రమించే ప్రయత్నం చేయగా మేం అధికారులకు ఫిర్యాదు చేసి 2012లో జిల్లా కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. విచారించిన కోర్టు రెండు ఎకరాల భూమి మేరాయమ్మకు చెందినదని ధ్రువీకరిస్తూ ఆక్రమణకు ప్రయత్నించిన బర్నబాస్‌ను హెచ్చరిస్తూ 69,188 అపరాధ రుసుము విధించి తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. కోర్టు కేసులో ఆపోజిట్



వ్యక్తులకు న్యాయవాదిగా ఎం.ఎన్ ప్రసాద్ వ్యవహరించి కేసు ఓడిపోవడం జరిగిందన్నారు. మా భూమి వ్యవహారం అంతా లాయర్ ఎం.ఎన్ ప్రసాద్‌కుతెలిసినప్పటికీ కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా వ్యవహరించి బొల్లా బ్రహ్మనాయుడు చేత అక్రమంగా కొనుగోలు చేయించాడని, ఈ అక్రమ భూ కబ్జాలో ఎం.ఎన్ ప్రసాద్ వాటా ఎంతో చెప్పాలని నిలదీశారు. కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ బర్నబాసు దౌర్జన్యం చేస్తుంటే పోలీస్ ప్రొటెక్షన్ కోసం మేము హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ప్రొటెక్షన్ కల్పించవలసిందిగా ఆదేశాలు ఇవ్వటం జరిగిందని కోర్టు ఆర్డర్ కాపీలు వారు బహిర్గతం చేశారు. 2020లో అప్పటి వైకాపా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బర్నబాసు వద్ద నాలుగెకరాలు భూమి కొనుగోలు చేసి పక్కనే ఉన్న మా 2 ఎకరాల మీద కన్నేశారని, అధికారం ఉందని అక్రమంగా బర్నబాస్‌కు భూమి అమ్మిన వాళ్ల చేత తప్పుడు డాక్యుమెంట్స్ పుట్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని, రెవెన్యూ అధికారులను ఒత్తిడి చేసి బై నెంబర్లతో ఆన్లైన్ చేయించుకుని, 2022లో ల్యాండ్ కన్వర్షన్ చేయించి అక్రమాలకు పాల్పడ్డారని వివరించారు. మా భూమి కబ్జాపై అప్పటి రెవెన్యూ జిల్లా అధికారుల చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేయగా అప్పటి ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అధికారులు చర్యలు తీసుకోకుండా అడ్డుపడ్డారని ఆరోపించారు. తన భార్య ఫిజికల్లీ హ్యాండీక్యాప్డ్ మేము ఇద్దరము నాడు నరసరావుపేటలో బ్రహ్మనాయుడు ఇంటికి వెళ్లి మేము పేదవాళ్ళం, దళితులం మా భూమిని మాకు చూపించండి అని వేడుకుంటే కనికరించకుండా మీకు భూమి లేదంటూ ఆగ్రహించిన బొల్లా బ్రహ్మనాయుడు కనీసం మానవత్వం కూడా లేకుండా నోటికొచ్చినట్టు మమ్మల్ని అసభ్యకరంగా తిట్టి అగౌరవపరిచాడని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూమి లో మేము ఉన్నప్పటికీ తన అధికారంతో బ్రహ్మనాయుడు రెవిన్యూ వెబ్ ల్యాండ్, అడంగల్, 1బిలో రెవెన్యూ అధికారులతో మా సర్వే నెంబర్ కు 309/13బి3, 309/13బి4, 309/13బి5 బైక్ నెంబర్లు వేసుకొని అక్రమంగా ఆన్లైన్ చేయించారని ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయంపై ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ.ఆంజనేయులను కలిసి విన్నవించుకుని,జిల్లా కలెక్టర్‌కు ప్రజా వేదికలో ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై పల్నాడు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కోర్టు ఆర్డర్ కాపీలు, గతంలో రెవెన్యూ, ఆర్ ఎస్ ఆర్,ఆర్ హెచ్, కాపీలు రికార్డ్ అంతా పరిశీలించి వెబ్‌లో నుండి బ్రహ్మనాయుడు తాలూకు వాళ్ల పేర్లు తొలగించాలని నరసరావుపేట ఆర్డీవోను ఆదేశించడం జరిగిందన్నారు. దళిత కుటుంబం భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి, రికార్డులు తారుమారు చేసి అన్యాయం చేసిన బొల్లా బ్రహ్మనాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు.

gnt 6:gnt 6.qxd 6/2/2026 12:47 AM Page 1



# బీజేపీ జెండా దిమ్మె నిర్మాణానికి అర్జీ



**కారంపూడి, జూన్ 1 ప్రభాతవార్త**
బీజేపీ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన ఊరు మన జెండా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న జెండా ఆవిష్కరించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ కన్వీనరు నాసరయ్య యాదవ్ అన్నారు. కారంపూడి బస్టాండ్ ఆవరణలో జెండా దిమ్మె నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ అనుమతి కోసం మండల అధ్యక్షులు గిరిధర్, సీనియర్ నాయకులు శెట్టి హనుమంతరావు, మండల ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి వెంకటరామిరెడ్డిలు పంచాయతీ అధికారులకు అర్జీ అందజేశారు.

# వైసీపీ బూత్ ఏజెంట్ల రెండో జాబితా అందజేత



**కారంపూడి, జూన్ 1, ప్రభాతవార్త**
వైసీపీ పార్టీ కారంపూడి మండల పోలింగ్ బూత్ ఏజెంట్ల రెండో జాబితాను వైసీపీ నాయకులు సోమవారం డిప్యూటీ తహశీల్దారు జి.విద్యాసాగర్‌కు అందజేశారు. ఇటీవల కారంపూడి మండల పోలింగ్ బూత్ ఏజెంట్ల జాబితాను వైసీపీ నాయకులు తహశీల్దారు కార్యాలయంలో అందజేశారు. మరికొన్ని బూత్ ఏజెంట్ల నియామకం పూర్తి కాకపోవడంతో కారంపూడికి చెందిన బూత్ నెంబర్ 279, పేటసన్నెగండ్లకు చెందిన 293 బూత్‌లకు సంబంధించి పోలింగ్ ఏజెంట్లను వైసీపీ అధిష్టానం నియమించడంతో వాటికి సంబంధించిన జాబితాను మండల అధ్యక్షులు కొంగర సుబ్రహ్మణ్యం, మండల బూత్ కమిటీ కన్వీనర్ కోట శివారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షులు చిలుకూరి చంద్రశేఖరరెడ్డిలు తహశీల్దారు కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహశీల్దారుకు జాబితా అందజేశారు.

# మాచర్లలో ఆపరేషన్ క్లీన్‌స్వీప్



**మాచర్ల, జూన్ 1 ప్రభాతవార్త**
మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాచర్లలో ఆపరేషన్ క్లీన్‌స్వీప్ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు అన్నారు. మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బదితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. 27, 28 వార్డులు, రామాటాకీస్‌లైన్, షాదీఖానా వద్ద కొమ్మాళన్ల కాలువలో మురుగు తొలగించి శుభ్రపరిచారు.

# వార్డుల్లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**మాచర్ల, జూన్ 1 ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం మాచర్లలో ఘనంగా జరిగింది. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 5, 22వ వార్డుల్లో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని వృద్ధులు, వికలాంగులు, ఇతర లబ్ధిదారులకు పింఛను నగదును అందజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం పింఛనుదారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పింఛను అందేలా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతికుమార్, నరసరావుపేట పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ మదినేటి శాంతి, 82వ బూత్ ఇన్‌ఛార్జి నర్రా రాముడు, 92వ బూత్ ఇన్‌ఛార్జి తవిశెట్టి ఏడుకొండలు, పట్టణ టీడీపీ వైస్ ప్రెసిడెంట్ కొమెర సాంబ, టీడీపీ కార్యకర్త ఎ.వాసు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంతో యువత గొంతు కోశారు: యాగంటి

**మాచర్ల, జూన్ 1 ప్రభాతవార్త**



వైసీపీ పార్టీ గత అయిదేళ్ల అధికారంలో యువత గొంతు కోశారని టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు జగన్ మంచి చెయ్యడు. ఎదుటివారు చేస్తుంటే ఓర్చుకోలేడు. అందుకే సైకో జగన్ మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు, విద్యామంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన నియామకాల్లో అవినీతికి తావే లేదన్నారు. తమ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర జగన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ వెయ్యని మోసకారి జగన్‌రెడ్డి అని అన్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని వైసీపీ అసత్య ప్రచారం చేస్తూ విద్యార్థులు, నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. 1983 నుంచి తెదేపా ఇప్పటి వరకు 18 డీఎస్సీలు ప్రకటించారన్నారు. యువతను మోసం చేయడంలో జగన్‌రెడ్డి మించిన నాయకుడు లేరని, ఉద్యోగాలను రాజకీయాల కోసం ఉపయోగించారని మండిపడ్డారు.

# ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్‌గా వెంకటరామిరెడ్డి

**విజయపురిసౌత్, జూన్ 1 ప్రభాతవార్త**




స్థానిక ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్‌గా డా॥ జి.వెంకటరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కమీషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ఏపీఆర్‌డీసీ ప్రిన్సిపల్‌గా విధులు చేపట్టారు. కళాశాల మాజీ ప్రిన్సిపల్ డా॥ ఎస్.నయీమ్‌బాను నుంచి బాధ్యతలు స్వీకరించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి నూతన ప్రిన్సిపల్ డా॥ జి.వెంకటరామిరెడ్డికి అభినందనలు తెలియజేస్తూ కళాశాల అభివృద్ధికి తన పూర్తిసహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఎం.వెంకటరామిరెడ్డి, వై.కేశవరెడ్డి, పి.సత్తిబాబు, బుజ్జి, నర్రా గురవారెడ్డి, సీతారెడ్డి తదితరులు పాల్గొని ప్రిన్సిపల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏపీఆర్‌డీసీ బోధన, భోదనేత సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలిపారు. కళాశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతోపాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

# ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపల్‌గా హేమాంబరరెడ్డి

**విజయపురిసౌత్, జూన్ 1 ప్రభాతవార్త**



ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపల్‌గా మారుసాని హేమాంబరరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇదే కళాశాలలో 2015-2025 వరకు బోటనీ లెక్చరర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా బోధన, భోదనేతర సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతోపాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## బాల పురస్కార అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

**రొంపిచర్ల,జూన్ 1 ప్రభాతవార్త**
భారత ప్రభుత్వము ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులు 2026 ప్రకటించినది. వివరాలను ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ ఉమాదేవి వివరాలను సోమవారం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య,ధైర్యసాసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాల విభాగాలలో అవార్డుల అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరుస్తున్న భారత సంతతికి చెందిన ఆసక్తిగల గల బాలలు ఈ ఏడాది జులై 31 తేదీ లోపుగా దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా పంపించాలని సూచించారు. కేంద్రం నియమించిన కమిటీ ద్వారా పరిశీలించి, ఎంపిక కాబడ్డ బాలలకు ఈ అవార్డులును గౌరవ భారత రాష్ట్రపతి వారిచే జనవరి నెలలో న్యూ ఢిల్లీ నందు ప్రధానం చేయబడును. ఈ అవార్డులు పొందుటకు భారతీయ సంతతికి చెందిన, భారత దేశంలో నివసిస్తున్న బాలలు మరియు ఎవరికైతే 31072026 నాటికి 18 సం++లు నిండని వారు మాత్రమే అర్హులన్నారు.అర్హులైన బాలలు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కొరకు ఆన్ లైన్ https://awards.gov.in ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఇరతవివముల కొరకు పై తెలిపిన వెబ్ సైట్ ను చూడవలసినదిగా పిడి ఉమాదేవి సూచించారు.

# మెగా డిఎస్సి అవకతవకలపై సిబిఐ దర్యాప్తు చేపట్టాలి

**- వైసీపీ జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ గజ్జల**



**నరసరావుపేట, జూన్ 1 ప్రభాతవార్త**
వైసీపీ పల్నాడు జిల్లా యూత్ కమిటీ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలపై స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టర్ కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ పూర్తిగా అవకతవకలతో, అవినీతితో నిండిపోయిందని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. మెరిట్ లిస్టులో ఉన్న టీచర్లకు ఉద్యోగాలు ఇవ్వకుండా లక్షల రూపాయలకు దొడ్డి దారిన ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపించారు. నిజాయితీగా డీఎస్సీ నిర్వహిస్తే మెరిట్ లిస్టు ఎందుకు ప్రకటించలేదని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం ఉద్యోగాలు వచ్చిన వారికే ఎస్ఎంఎస్ మెసేజ్ లు పంపించి వారిని ఉద్యోగాలలో జాయిన్ చేసుకున్నారని అన్నారు. స్పోర్ట్స్ కోటాలో సుమారు 420 ఉద్యోగాల్ని ఒక్కొక్క ఉద్యోగం రూ.15 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. కేంద్రం ప్రకటించిన స్పోర్ట్స్ కోటాలో అర్హులైన శ్రీకాకుళం జిల్లాకు చెందిన వాసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా క్రీడా మైదానం అంటే ఏమిటో తెలియని వాళ్లకు లక్షలాది రూపాయలు తీసుకొని ఉద్యోగాలు అమ్ముకొని అవినీతికి పాల్పడ్డారన్నారు. డీఎస్సీ మీద అవకతవకలపై ప్రశ్నిస్తున్నందుకే వైసీపీ నాయకులపై కేసులు పెట్టి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వం తక్షణమే మెరిట్ లిస్టు ప్రకటించి డీఎస్సీ రాసిన నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో జరిగినఅవకతవకలపై తక్షణమే సిబిఐ దర్యాప్తు లేదా రిటైర్డ్ హైకోర్టుజడ్జి చేత విచారణ జరిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీనాయకులు,కార్యకర్తలు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# యువత చైతన్యవంతం కావాలి

**- ఎమ్మెల్యే డా. చదలవాడ**



**నరసరావుపేట, జూన్ 1 ప్రభాతవార్త**
నరసరావుపేట మండలం కోటప్పకొండ శ్రీ షిరిడి సాయిబాబా కమ్యూనిటీ హాల్‌లో కమ్యూనిస్ట్ పార్టీ అనుబంధ సంస్థ ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం యువతకు విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కమ్యూనిస్ట్ ఉద్యమ నేపథ్యాన్ని, పోరాట స్ఫూర్తిని యువతకు గుర్తు చేశారు. మన బ్యాక్ గ్రౌండ్ కమ్యూనిస్ట్ పార్టీ అని, దాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదని అన్నారు. గతంలో కమ్యూనిస్ట్ నాయకులంతా పోరాటాలు చేశారని, అమరులైన వారి కుటుంబాలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని గుర్తు చేశారు. కమ్యూనిస్ట్ పార్టీలో చేరండి ఎర్ర జెండా పట్టుకోండి, కానీ నీతి నిజాయితీని, ధైర్యాన్ని వదిలిపెట్టొద్దని అన్నారు.ఏఐవైఎఫ్ ద్వారా ట్రైనింగ్ పొందిన వెయ్యి మంది యువత సమాజంలోకి వెళ్లి పది లక్షల మందికి పాఠాలు చెప్పే శక్తి కలిగిఉంటారన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ కామ్రేడ్ అంటేనే రియల్ హీరో అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. కృషి, పట్టుదలతో పాటు సమాజాన్ని చైతన్యం చేయగలిగే పరిజ్ఞానాన్ని పెంచుకోగలిగితే ప్రతి ఒక్కరు ప్రజాప్రతినిధులుగా ఎదగవచ్చని అన్నారు. యువత విద్య, ఎకనామిక్స్, పాలిటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు లకు కమ్యూనిస్ట్ పార్టీ వాళ్ళంటే చాలా ఇష్టమని, మీరందరూ వారి గుండెల్లో ఉంటారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రాంబాబు, వరదయ్య, కమ్యూనిస్ట్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు అంకాళమ్మకు బోనాలు





**గురజాల, జూన్ 1 ప్రభాతవార్త**
గురజాల పట్టణంలో గ్రామ దేవత అంకాళమ్మ, జక్కా వారి అంకమ్మలకు మంగళవారం బోనాలు సమర్పించనున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు. వేకువ జాము నుంచే అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తారన్నారు. సాయంత్రం గ్రామంలో ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

# పి4 విధానంతో మైనర్ ఇరిగేషన్ బ్రిడ్జి నిర్మాణం



**నరసరావుపేట, జూన్ 1 ప్రభాతవార్త**
నరసరావుపేట మండలం కేతముక్కల అగ్రహారంలో సోమవారం పి4 విధానం ద్వారా మైనర్ ఇరిగేషన్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శంకుస్థాపన చేశారు. దివంగత డాక్టర్ బొల్లినేని పూర్ణచంద్రరావు, బొల్లినేని రాఘవరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ బ్రిడ్జిని సొంత నిధులతో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబుమాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయడానికి ఇది నిదర్శనమన్నారు. మాజీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ బొల్లినేని పూర్ణచంద్రరావు కుమారుడు వేణుగోపాల్, కుటుంబ సభ్యులు శరత్, శ్రీధర్‌లు గ్రామాభివృద్ధికి ముందుకు వచ్చారన్నారు. గ్రామంలోని వాగు దాటేందుకు రైతులు ఇబ్బంది పడుతుండడంతో వారే స్వయంగా బ్రిడ్జి నిర్మిస్తామని ముందుకొచ్చాని తెలిపారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పి4 విధానంలో మైనర్ ఇరిగేషన్ అధికారుల నుంచి ఎన్ఓసీ తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో ఈ బ్రిడ్జిని బొల్లినేని కుటుంబ సభ్యులే నిర్మిస్తున్నారని తెలిపారు. ఇది రైతులు పొలాలకు వెళ్లి రావడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఇది ఇతరులకు ఆదర్శం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే గ్రామంలోని మూడు దేవాలయాల చుట్టూ ప్రహరీ గోడలను కూడా ఆ కుటుంబ సభ్యులు పి4 ద్వారా నిర్మిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**రొంపిచర్ల , జూన్ 1 ప్రభాతవార్త**
నరసరావుపేటనియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పంపిణి చేశారు. పట్టణంలోని 24, 3 వ వార్డులలోను, రొంపిచర్ల మండలం విప్పర్ల, మర్రిచెట్టు పాలెం, దాసరిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే అరవిందబాబు పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్లు అందించే గొప్ప కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు.కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, పంచాయతీ సెక్రెటరీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విత్తనాల షాపుల్లో వ్యవసాయ అధికారుల తనిఖీలు



**నరసరావుపేట క్రైమ్, జూన్ 1 ప్రభాతవార్త**
జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ కేవీ శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి తో కలిసి నరసరావుపేట లోని స్టేషన్ రోడ్ నందు గల విత్తన షాపులను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో విత్తన భౌతిక నిల్వలను,స్టాక్ రిజిస్టర్, బిల్లులను వెరిఫై చేశారు. విత్తన డీలర్లు అధికృత కంపెనీల వద్ద నుండి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, సోర్స్ ఆఫ్ సప్లై ఫారం లను విధిగా పొందుపరచుకోవాలని డీలర్లను హెచ్చరించారు. విత్తన చట్టాన్నిఅతిక్రమించిచో చట్టపరమైన చర్యలు తీసుకొని బడతాయని డీలర్లను హెచ్చరించారు. రైతులు తాము ఎంచుకున్న విత్తనాన్ని లైసెన్స్ కలిగిన అధికృత డీలర్ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనానికి లాట్ నెంబర్ తో కూడిన రసీదును పొంది, పంట కాలం మొత్తం పూర్తయ్యేంతవరకు తమ వద్ద భద్రపరుచుకోవాలని వ్యవసాయ అధికారు తెలియజేశారు.

# పాత అంబాపురంలో కార్డెన్ సెర్చ్

**గురజాల, జూన్ 1 ప్రభాతవార్త**



గురజాల డీఎస్పీ మహేశ్వరరావు ఆధ్వర్యాన సోమవారం మండలంలోని పాత అంబాపురంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గృహాలు, దుకాణాలు, ఖాళీ ప్రదేశాల్లో తనిఖీలు జరిపి 2 గొడ్డళ్లు, 3 పలుగులు, 6 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గురజాల సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్, దాచేపల్లి సీఐ రాజేష్, ఎస్ఐ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

gnt 7:gnt 7.qxd 6/2/2026 12:50 AM Page 1



## లోఓల్టేజీ సమస్యకు రెండు సంవత్సరాలు



**నాగులుప్పలపాడు, జూన్ 1, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన నాగులుప్పలపాడు గ్రామంలోని పాత పంచాయతీ ఎదురుగా గల ఎన్టీఆర్ నగర్ విద్యుత్ వినియోగదారులు గత రెండు సంవత్సరాలుగాతీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది స్థానిక శాసనసభ్యులు విజయ్ కుమార్ ఎన్టీఆర్ బొమ్మ ప్రారంభోత్సవంలో లోఓల్టేజి సమస్య తొలగిస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఆ హామీ ఇచ్చి ఏడాది దాటినా సమస్య దిమ్మెకు మాత్రమే పరిమితమైంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేసి విన్నవించారు.

## ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ జేవీ మోహన్‌రావుకు డాక్టరేట్




**మార్టూరు, జూన్ 1, ప్రభాతవార్త**
ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ జేవీ మోహన్‌రావుకు ఫ్రాన్స్ దేశంలో పారిస్ నగరంలో ఉన్న కెన్నెడి విశ్వ విద్యాలయం వారు పర్యావరణం, సుస్థిరాభివృద్ధి అనే అంశాలపై గౌరవ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫి(పీహెచ్‌డీ) ప్రధానం చేయటం జరిగింది. జేవీ మోహన్‌రావు గత 40 సంవిత్సరాలుగా సేవా రంగంలో పూర్తిగా నిమగ్నమై, నిరంతరం కృషి చేస్తున్నారు. గత 26 సంవత్సరాలుగా ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 9 రాష్ట్రాలలో 2.50 లక్షల రైతు కుటుంబాలకు చేయూతనిచ్చి సుస్థిర వ్యవసాయం, సహజవనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకై 1909 గ్రామాలలో వినూత్నమైన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఎఫర్ట్ సంస్థ ద్వారా 528 గ్రామాల నీటి సంరక్షణకై 1004 చెక్ డ్యామ్‌లను నిర్మించి 24.77 లక్షల క్యూబిక్ మీటర్లు నీటి నిల్వ చేయటం జరిగింది. 74.28 లక్షల క్యూబిక్ మీటర్ల నీటిని వర్షపు నీటిని భూమిలోకి ఇంకించటానికి ఏర్పాటు చేయడం జరిగింది. సుస్థిర వ్యవసాయం కింద 9 రాష్ట్రాలలో 52,600 మంది రైతులతో 1,03,200 ఎకరాలలో సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించే విధంగా తయారు చేసి రసాయనిక అవశేషాలు లేని వ్యవసాయ ఉత్పత్తులు పండించే రైతులు ఆదాయాన్ని 30 శాతం వరకు పెంచడం జరిగింది. ఎఫర్ట్ సంస్థ ద్వారా చేపట్టిన పర్యావరణ, సుస్థిరాభివృద్ధి కార్యక్రమాలు గుర్తించి ఫ్రాన్స్‌లోని కెన్నెడి విశ్వవిద్యాలయం వారు జేవీ మోహన్‌రావుకు గౌరవ డాక్టరేట్‌ని ప్రధానం చేయటం జరిగింది. జేవీ మోహన్‌రావు గౌరవ డాక్టరేట్ గౌరవం పట్ల ఎఫర్ట్ సంస్థ కార్యవర్గం సిబ్బంది, శ్రీకరం రోటరీ కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు కందిమళ్ళ సాంబశివరావు, జాష్టి అనురాధ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్ష, కార్యదర్శులు మాదాల సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, రోటరీ సభ్యులు అభినందనలు తెలపటం జరిగింది. ఎఫర్ట్ కార్యక్రమాలు ఇంకా విస్తరించి ఇంకా కొత్త పథకాలు రూపొందించాల్సిందిగా కోరారు.

## అన్నదానం చేసిన ముప్పవరపు కుటుంబ సభ్యులు



**మార్టూరు, జూన్ 1, ప్రభాతవార్త**
రోటరీక్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో ముప్పవరపు నరేంద్రబాబు భార్య సుధారాణి కూతురుహంసిని,కుటుంబ సభ్యుల సహకారం తో స్థానిక వెంకయ్య ఆశ్రమంలోని వృద్దులు, అనాధలకుస్వీట్లు,పండ్లుపంపిణీ చేసి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు అధ్యక్షులు మాదాల సాంబశివరావు, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, మాజీ అధ్యక్షులు జాష్టి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, షేక్ ఖాజా హుస్సేన్‌లు పాల్గొన్నారు.

# పేదల ఇళ్లల్లో పింఛన్ల సంబరం

**- పెన్షన్ల పంపిణీలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి**



**హనుమంతునిపాడు, జూన్ 1, ప్రభాతవార్త**
ఎప్పటిలాగే ఒకటో తేదీన మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగలా సాగింది. పింఛన్ నగదును అందుకున్న వృద్దులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు సంతోషంతో పొంగిపోయారు. కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం అంటూ ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం మండలంలోని హనుమంతునిపాడు, కొండారెడ్డిపల్లి, హనుమంతపురం తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాలలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్ నగదును పంపిణీ చేశారు. స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులు ఇళ్ల ముంగిటకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి బాగోగులు విచారించారు. పెన్షన్లతో పాటు అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని మా సపోర్టు కూటమి ప్రభుత్వానికేనని స్పష్టంగా చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు చీకటి వెంకట సుబ్బయ్య, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, సచివాలయం సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే కూటమి ప్రభుత్వం ఆశయం

**- పండుగ వాతావరణంలో పెన్షన్లు**



**లింగసముద్రం, జూన్ 1, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల భరోసా కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాలలో పేద ప్రజలు, వృద్దులు,వికలాంగులకు ఒకటో తేదీన అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ల నగదు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల పండుగ వాతావరణంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పెన్షన్ల నగదును ఒకటో తేదీ లోపు ఇవ్వాలన్నదే సీఎం నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని పెన్షన్ల పంపిణీ కోసం ఏడాదికి 32.5 వేల కోట్ల రూపాయలు కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమ పాలన టీడీపీతోనే సాధ్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వంలో సమర్ధవంతంగా పాలన అందిస్తుందని ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్ నగదును లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పూరిమెట్ల గురునాథం, మండల ప్రధాన కార్యదర్శి అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు గాలంకి ప్రసాద్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు పూరిమెట్ల మాల్యాద్రి, మాజీ ఎంపీపీ పూరిమెట్ల బాలకోటయ్య, బింకం శేషయ్య, అడపా నరసయ్య, ఉన్నం వీరాస్వామి, సోంపల్లి మనోహర్, ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు, మద్దెల రామారావు, బాలకోటయ్య, మాల్యాద్రి, జంపాల కృష్ణయ్య, అత్తంటి రంగయ్య, బొలినేని రమణయ్య, షేక్ రఫీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ పంపిణీని పరిశీలించిన ఎంపీడీవో శ్రీనివాసులు



**లింగసముద్రం, జూన్ 1, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ల కార్యక్రమాన్ని ప్రతి నెల 1వ తేదీన సచివాలయ సిబ్బంది స్థానిక నాయకులు కలిసి పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా లింగసముద్రం మండలకేంద్రం పెద్దపవని పంచాయతీ, వెంగళాపురం, యర్రారెడ్డిపాలెం గ్రామాలలో లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేస్తున్న తీరును స్థానిక ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలోసచివాలయ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

## చీరాలలో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి



**చీరాల టౌన్, జూన్ 1, ప్రభాతవార్త**
చీరాల పట్టణం పెద్ద మసీదు ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని దళిత బహుజన పార్టీ నాయకుడు షేక్ జిలాని చీరాల మున్సిపల్ కమీషనర్ కే.డానియేల్ జోసఫ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో డ్రైనేజీ కాలువకు తక్షణమే మూత ఏర్పాటు చేసి, పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్‌ను కోరారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా సమస్యను అత్యవసరంగా పరిష్కరించి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం, మురుగునీరు రోడ్లపైకి చేరడం వల్ల స్థానికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. మురుగునీటి నిల్వకారణంగా దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ ప్రభుత్వ భూముల కబ్జాలో ప్రధాన సూత్రధారి బొల్లా బ్రహ్మనాయుడు

**- నకిలీ జీవోలు,నకిలీ పత్రాలతో రూ.1,500 కోట్లు నొక్కేయడానికి పథకం**

**- పోలీసుల విచారణలో బయటపడ్డ నిజాలు - బొల్లా అక్రమాలపై తెదేపా నేతలు ఫైర్**




**వినుకొండ,జూన్1,ప్రభాతవార్త**
వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గండిపేట భూ కబ్జా వ్యవహారంపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో న్యాయ విభాగ సంఘ నాయకులు సైదారావు,రామకోటేశ్వరరావు,సిద్ధయ్య, తిరుపతిరావు, టీడీపీ టౌన్ అధ్యక్షుడు బొంకూరి రోశయ్యలు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.రూ.1,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నొక్కేయడానికి నకిలీ జీవోలు,నకిలీ పత్రాలు సృష్టించిన బొల్లా బ్రహ్మనాయుడు ఒక ఘరానా మోసగాడని దుయ్యబట్టారు. ఏ తప్పు చేయకపోతే ఆయన ఎందుకు పరారయ్యారని ప్రశ్నించారు. బొల్లా అక్రమాలను వెనకేసుకురావడం వైసిపి నాయకులకు సిగ్గుచేటని మండిపడ్డారు. తెర వెనుక కింగ్ పిన్ బ్రహ్మనాయుడే! భూమి కొనుగోలు అగ్రిమెంట్‌లో బ్రహ్మనాయుడు పేరు లేనంత మాత్రాన ఆయనకు సంబంధం లేదనడం హాస్యాస్పదమని టీడీపీ నేతలు కొట్టిపారేశారు. ఏ దొంగ అయినా పెద్ద స్కామ్‌లలో తన పేరు నేరుగా డాక్యుమెంట్లపై పెట్టుకోడని ఎద్దేవా చేశారు. తన సొంత బంధువు బొల్లా రమేష్‌ను ముందు పెట్టి, తెర వెనుక వందల కోట్ల రూపాయల డీల్ నడిపించింది మాజీ ఎమ్మెల్యేనేనని, ఇందుకు పోలీసుల విచారణే సాక్ష్యమని పేర్కొన్నారు. వందల కోట్ల విలువైన గండిపేట భూమి డీల్‌కు బ్రహ్మనాయుడు బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు వెళ్లాయంటేనే ఈ కబ్జా యత్నంలో ఆయన ప్రత్యక్ష భాగస్వామ్యం స్పష్టమవుతోందని మండిపడ్డారు. అడగగానే కోట్లు ట్రాన్స్ఫర్ చేయడానికి ఆయనేమైనా చారిటీ సంస్థా అని ప్రశ్నించారు. నకిలీ జీవోల సృష్టి - మాఫియా స్టైల్ దోపిడీ ఐఏఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి, కలెక్టర్, సీసీఎల్ఏ, హైడ్రా కార్యాలయాల పేర్లతో నకిలీ క్లియరెన్సులు, నకిలీ జీవోలు సృష్టించడం అత్యంత ప్రమాదకరమైన నేరమని నేతలు ధ్వజమెత్తారు. ఫోర్జరీ జీవోల కోసం రూ.4 కోట్లు, లాయర్ బృందానికి మరో రూ.4 కోట్లు ఇచ్చినట్లు పోలీసులు చెబుతున్న వివరాలు చూస్తే ఇది ఎంత పెద్ద మాఫియా స్టైల్ దోపిడీయో అర్థమవుతోందన్నారు. ఐదేళ్లపాటు ఏపీని అరాచకాలతో దోచుకున్న వైసిపి నేతల కన్ను ఇప్పుడు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌పై పడిందని ఆరోపించారు. స్కామ్ దొరికిపోతుందని తెలిసి, తప్పును లీగలైజ్ చేసుకోవడానికి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి బొల్లా రమేష్ బాధితుడిలా నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. తెలంగాణ పోలీసులు చెబితే రాజకీయ కక్షసాధింపా? ఈ కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసింది శేరిలింగంపల్లి డీసీపీ ఆధ్వర్యంలోని తెలంగాణ (కాంగ్రెస్ ప్రభుత్వం) పోలీసులని టీడీపీ నేతలు గుర్తుచేశారు. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే, ఇక్కడ ఏపీలోని కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగిందని వైసిపి నేతలు మొసలి కన్నీరు కార్చడం వారి దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమన్నారు. వినుకొండలో ఐదేళ్లపాటు సాగించిన అక్రమాలు చాలదన్నట్టు, పక్క రాష్ట్రంలో కూడా కబ్జాలకు స్కెచ్‌లు వేయడం బ్రహ్మనాయుడి క్రిమినల్ హిస్టరీకి అద్దం పడుతోందని, అందుకే వినుకొండ ప్రజలు ఆయనను ఓడించారని పేర్కొన్నారు. ఏపీలో సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో పారదర్శక పాలన కొనసాగుతోందన్నారు. నకిలీ పత్రాలు తయారు చేసిన వారిపైనే కాకుండా,వారి వెనుక ఉన్న అసలు రాజకీయ మాస్టర్ మైండ్లపై కూడా చట్టం కఠిన చర్యలు తీసుకుంటుందని టీడీపీ నాయకులు హెచ్చరించారు.

## ఎర్రబాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన గ్రామ టిడిపి పార్టీ నాయకులు

**క్రోసూరు ( జూన్ 01 ప్రభాతవార్త )**
రాష్ట్ర కూటమి ప్రభుత్వం పెదకూరపాడు నియోజకవర్గ శాసన సభ్యులు భాష్యంప్రవీణ్ ఆదేశాలతో క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎర్రబాలెం సీనియర్ నాయకులు ఎర్రబాలెం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేపూరి గోవిందరావు, వేపూరి ఉసియ్య నాయుడు,కొజ్జా అమరయ్య, పగడాల రాజు మోడీ మర్య రాజు, మాతంగి వెంకట్రావు పగడాల అమూర్త బాబు మరియు జన సైనికుడు ఎర్రబాలెం జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తుల మురళి, వేపూరి అనిల్ కుమార్, నీరుకొండ బాజీ మహాకూటమి నాయకులతో కలిసి వృద్దులకు, వికలాంగుల పెన్షన్ పంపిణీ చేశారు.

## క్రోసూరు నూతన ఇన్ చార్జి ఎంపీడీఓ గా ఎస్.రాధా రమణ

**- క్రోసూరు మండల నూతన ఇన్ చార్జి**

**క్రోసూరు ,జూన్ 1 ,ప్రభాతవార్త**
ఎంపీడీఓ గా ఎస్. రాధా రమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేస్తున్న ఎంపీడీవో జి.రవికుమార్ పదవి విరమణ చేయడంతో పరిపాలన అధికారిగా పని చేస్తున్న రాధా రమణ కు పూర్తి స్థాయి ఇంచార్జి ఎంపీడీఓగా నియమిస్తూ జడ్పీ సీఈఓ జ్యోతి బసు ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాధా రమణ మాట్లాడుతూ ఎల్లప్పుడూ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందేలా తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.రాధా రమణ కు కార్యాలయ సిబ్బంది మరియు క్రోసూరు మండల రిపోర్టర్ లు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజల భాగస్వామ్యంతో మలేరియా నివారణ సాధ్యం

**- వైద్య అధికారులు రవికుమార్, అనిల్ కుమార్, మేరీ శ్రీ కళ**

**క్రోసూరు( జూన్ 1 ప్రభాతవార్త )**
ప్రతి సంవత్సరం జూన్ నెలలో మలేరియా వ్యతిరేక మాస ఉత్సవంగా నిర్వహిస్తారని, వర్షాకాలం ప్రారంభమయ్యే ఈ సమయంలో దోమల పెరుగుదల ఎక్కువగా ఉండటం వల్ల మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రవికుమార్ అనిల్ కుమార్ మేరీ శ్రీకళలు పేర్కొన్నారు జూన్ 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు సందర్భంగా సోమవారం మలేరియా వ్యతిరేక ప్రతిజ్ఞ, మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని పై విధంగా అన్నారు మలేరియా వ్యతిరేక ప్రతిజ్ఞను ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ నిర్వహించారు. ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నిర్మూలన సాధ్యమని వైద్య అధికారులు తెలిపారు తరచుగా జ్వరం రావడం, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, అధిక చెమటలు, బలహీనత, నీరసం మలేరియా లక్షణాలని వైద్యాధికారులు పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ఆశా కార్యకర్తను గాని ఆరోగ్య కార్యకర్తను గాని సంప్రదించి రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు మల్లేశ్వర రావు, శివుడు, హెల్త్ అసిస్టెంట్ ప్రేమ రాజ్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు

## 10వ వార్డులో పెన్షన్లు అందజేసిన ఖదరువూరి టిడిపి నేతలు



**సత్తెనపల్లి, జూన్ 1, ప్రభాతవార్త**
పెన్షన్ల పంపిణీలో భాగంగా సోమవారం స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేసునుసారం ఉదయాన్నే 10వ వార్డులో అర్హులకు పెన్షన్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు, డిఎన్ఆర్ ఫౌండేషన్ అధినేత దరువూరి నాగేశ్వరరావు, వార్డు పార్టీ ఇంచార్జ్ శిఖాఏడుకొండలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో భరతమాత అన్నప్రసాద వితరణ పథకం నిరుపేదలకు భరోసా

**సత్తెనపల్లి, జూన్ 1, ప్రభాతవార్త**
సత్తెనపల్లి పట్టణంలోనీ యానాది కాలనీలో సోమవారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా, గోపయపాలెం వాస్తవ్యులు దివంగత కొండ్రు వెంకటస్వామి పవిత్ర ఆత్మకు సద్గతులు కలగాలని ఆయన మేనల్లుడు పెద్దలు రాజమహేంద్రవరం వాస్తవ్యులు గాలి కిషోర్ బాబు 5,000రూపాయల ఆర్థిక సహాయంతో 180 మందికి నిరుపేదలకు ఉచితంగా భోజనం అందించటం జరిగింది. కొండ్రు వెంకట్రావు మనుమరాండ్రు ప్రజ్వల, యామిని,పూజిత సహకరించారు. ఈ సందర్భంగా ఈ పథకం రూపశిల్పి మరియు న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి దాతలకు, వారి కుటుంబ సభ్యులకు, కార్యక్రమంలో సేవలు అందించిన దమ్మాలపాటి బాల వెంకటేశ్వర్లు టీంకు, అతి తక్కువ ధరకు రుచి, శుచి కరమైన భోజనం క్యాటరింగ్ చేసిన యజమాని ఓగిబోయిన కొండలుకు హృదయ పూర్వక ధన్యవాదాలు అని తెలిపారు.



## 13వ వార్డులో ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల పంపిణీ



**సత్తెనపల్లి, జూన్ 1, ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను సోమవారం లబ్ధిదారులకు 13వ వార్డు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందజేశారు. అందరూ కలిసి ఐకమత్యంగా ఇంటింటికీ తిరిగి సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచన మేరకు ఉదయం 7 గంటలకే ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ పెన్షన్లు అందుకున్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు.

# 9 వార్డులో పెన్షన్లు అందజేత



**సత్తెనపల్లి, జూన్ 1, ప్రభాతవార్త**
పట్టణంలోని 9వ వార్డులో నూతనంగా మంజూరైన స్పౌస్ పెన్షన్‌లను సోమవారం లబ్ధిదారులకు అందించారు. వార్డు మాజీ కౌన్సిలర్ బి. సురేష్ కుమార్,సచివాలయ అడ్మిన్ కరిముల్లా ,వెల్ఫేర్ సెక్రటరీ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి




**సత్తెనపల్లి, జూన్1, ప్రభాతవార్త**
ప్రముఖ నటుడు, సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని కళాకారులు ఆయనకు నివాళులు అర్పించారు. స్థానిక కార్తీక్ రెసిడెన్సీ లో జరిగిన ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి కళాకారులు హాజరయ్యారు. ముందుగా సూపర్ స్టార్ కృష్ణ చిత్రపటానికి సీనియర్ సూపర్ స్టార్ కృష్ణ అభిమాని ఎస్.కె సుభాని పూలమాలవేసి నివాళులర్పించారు. ఏపీ మా అసోసియేషన్ ట్రెజరర్ గుర్రం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృష్ణ తెలుగు సినిమా హీరోగా ప్రజాదరణ సాధించి, సూపర్ స్టార్‌గా ప్రఖ్యాతి పొందాడని అన్నారు. సినీ కళాకారులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వల్లెం లక్ష్మీ చెన్నకేశవరావు మాట్లాడుతూ 1964కు ముందు పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన కృష్ణకు 1964-65లో హీరోగా నటించిన తొలి సినిమా తేనెమనసులు,మూడవ సినిమా గూఢచారి 116 పరిశ్రమలో నిలదొక్కుకునేందుకు ఉపకరించాయన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది పులహరి మధుసూదన రావు, ఏటియుసి నాయకులు కంబాల శ్రీనివాస్, ఆయుర్వేద వైద్యులు రాయపూడి శివ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ డిప్యూటీ ఏఈగా రామునాయక్

**మాచర్ల, జూన్ 1 ప్రభాతవార్త**
మాచర్ల పురపాలక సంఘ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా ఆర్.రాములునాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈయన పదోన్నతిలో భాగంగా మాచర్ల మున్సిపల్ డీఈగా విధులు చేపట్టారు. గతంలో సత్తెనపల్లి అసిస్టెంట్ ఇంజినీరు(ఏఈ)గా పనిచేసి పదోన్నతిపై మాచర్ల డీఈగా వచ్చారు. సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

